


పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు : పిఒ

ప్రజాశక్తి -భామిని

పాలకొండ నియోజకవర్గం పరిధిలో గల అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. గురువారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పిఒ పరిశీలించారు. ఘనసర పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలన్నారు. అంతేకాక ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సింగిడిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మరుగుదొడ్డి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బురుజోల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలపు అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అలికాన సందీప్, పంచాయతీరాజ్ జెఇ గౌరీశంకర్, ఎన్నికల సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులు, బిఎల్‌ఒలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి టిక్కెట్ ఎవరికో?







- ప్రజల్లో సర్వత్రా చర్చ
- వేధిస్తున్న గ్రూపు రాజకీయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ కురుపాం నియోజకవర్గంలో టిడిపి టికెట్ ఎవరికనే చర్చ ప్రతి ఊరూ వాడ జరుగుతోంది. గత పదేళ్లుగా నియోజకవర్గంలో టిడిపికి సరైన అభ్యర్థి లేకపోవడంతో వైసిపి తన మెజార్టీ నిరూపించుకుంది. ఈసారైనా టిడిపి మంచి అభ్యర్థిని నిలబెట్టి గెలుపు కోసం పార్టీ అధిష్టానం వ్యూహ రచన చేస్తుంది. అయితే టిడిపిలో ఎమ్మెల్యే టిక్కెట్ కోసం పోటీపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ కనిపిస్తుంది. అయితే పోటీపడుతున్న వారిలో ఎవరికి టిక్కెట్ కేటాయించాలనే అనేదానిపై పార్టీ అధిష్టానం అంతర్గత సర్వే నిర్వహిస్తుంది. అయితే ఇందులో ఎక్కువ శాతం మొదటి నుంచి పార్టీకి కష్టపడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ఇన్చార్జి పదవి అప్పగించినప్పటి నుంచి నేటి వరకు క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధి కోసం 25 నెలల పాటు శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే మరోవైపు రెండో వర్గానికి చెందిన బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు నందివాడ కృష్ణబాబు కూడా టిడిపి టిక్కెట్ కోసం మొదటి నుంచి గట్టిగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. చివరి నిమిషంలో వచ్చిన కురుపాంకు చెందిన మాజీ ఎంపి ప్రదీప్‌దేవ్ కుమారుడు వీరేష్ చంద్ర దేవ్ కూడా ఎంపి లేదా ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. దీంతో ఎవరికి వారు చాపకింద నీరులా పార్టీ టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పాముల పుష్ప శ్రీవాణిని ఎన్నికల్లో ఢీకొట్టాలంటే సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్న, ప్రజాదరణ పొందివున్న అభ్యర్థి కోసం టిడిపి సర్వేలు తీవ్రతరం చేసింది.

టిడిపిని వేధిస్తున్న గ్రూపు రాజకీయాలు


ఇదిలా ఉండగా నియోజకవర్గం టిడిపిని గ్రూపు రాజకీయాలు వేధిస్తున్నాయి. ఈ సమస్య వైసిపిలో కనిపించడం లేదు. ఇది ఒక విధంగా వైసీపీకి ప్లస్ పాయింట్‌గా చెప్పవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో నిజమైన గిరిజన అభ్యర్థికి టిక్కెట్ కేటాయించాలనే గిరిజన నినాదం ఉన్నా ఆ నినాదం ఏ మేరకు పనిచేస్తుందో వేచి చూడాలి. చివరి నిమిషం వరకు ఎమ్మెల్యే టికెట్ ఎవరికి కేటాయిస్తారోనని ప్రజల్లోనూ, ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ కనబడుతుంది. 2024 ఎన్నికలు కురుపాం నియోజకవర్గంలో హీట్ ఎక్కనున్నాయి.

మొబైల్ టవర్లతో డిజిటల్ విప్లవం

సెల్‌టవర్ల ప్రారంభ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

సెల్‌టవర్ల ఏర్పాటుతో డిజిటల్ విప్లవం రానుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ గంగన్నదొరవలస, జియ్యమ్మవలస మండలం పిటి మండ గిరిజన గ్రామాల్లో నిర్మించిన మొబైల్ టవర్లను గురువారం వర్చువల్ విధానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ టవర్ల ఏర్పాటుతో డిజిటల్ విప్లవం వచ్చి గొప్ప మార్పునకు నాంది పలకనుందని, యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ కింద రాష్ట్రంలో నిర్మించిన దాదాపు 4 వందల టవర్లను రూ.3119 కోట్లతో 2900 టవర్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఏడాదిలో అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ టవర్ల ఏర్పాటుతో జిల్లాలో నూతన శకం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4జి కవరేజ్ వస్తూ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 60 టవర్లకు అటవీ అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాలో 196 టవర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు రూ.200 కోట్లు ఖర్చవుతుందని, తద్వారా దాదాపు 40వేల మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. టవర్ల ఏర్పాటు ఈ ప్రాంతానికి ఒక వరం లాంటిదన్నారు. జిల్లా యంత్రాంగం నుండి క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బందితో బాగా అనుసంధానం జరుగుతోందని, పౌరులు తమ బంధువులతో అనుసంధానంతో ఎంతో ప్రయోజనం కలుగతుందని తెలిపారు. అత్యవసర సమయంలో మొబైల్ ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయవచ్చని, అలాగే ప్రజలు పథకాలకు దగ్గర అవుతున్నారని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సైతం తమ సమస్యలు సులభంగా ఫోన్ ద్వారా తెలియజేయగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు, ఎంపిడిఒ ఎస్. అప్పారావు, వివిధ శాఖల మండలాల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు ఎంపీటీసీలు గ్రామస్తులు పాల్గొన్నారు.


సిఎం వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



విద్యుత్తు కాంతులతో ముస్తాబైన కలెక్టరేట్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోంది. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం ఉదయం జాతీయ జెండాను ఎగురవేస్తారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖలు తమ అభివృద్ధి తెలియజేసే శకటాలను ప్రదర్శించేందుకు సిద్ధం చేస్తుండగా, మరికొన్ని శాఖలు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తూ తమ శాఖల ప్రగతిని తెలియజేస్తున్నాయి. దేశభక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. జిల్లా ఏర్పడిన అనంతరం రెండో గణతంత్ర దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున గణతంత్ర వేడుకలు వీక్షించేందుకు రానున్నారు.

9న మున్సిపల్ షాపుల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ అధీనంలో ఉన్న మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22, 34, 36, 44, 45 నెంబర్ల షాప్‌లను ఫిబ్రవరి 9న ఉదయం 11 గంటలకు కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. ఈ వేలం పాటకు ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 9న మున్సిపల్ కార్యాలయంలో హాజరు కావాలని, పూర్తి వివరాల కొరకు కార్యాలయం పనిచేసే దినాల్లో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు

నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సిబ్బందికి సూచించారు. జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిసెంబర్ మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన జిల్లాలో నమోదైన, దర్యాప్తులో ఉన్న నేరాల కేసులను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, ఎన్‌డిపిఎస్, ఐటి యాక్ట్ కేసులు, మహిళలపై జరిగే అన్యాయాలు, ప్రాపర్టీ దొంగతనాలు వంటి కేసుల గురించిన వివరాలు విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత కేసుల గురించి అడిగి తెలుసుకొని వాటిలో శిక్షలు పడేలా చేసి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, రోడ్ భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేయాలని, బైకు, ఇళ్ల దొంగతనాలు జరగకుండా ఆస్తి నేరాలు నివారణకు గస్తీలను మరింత బలోపేతం చేసి, ప్రత్యేక బృందాలు నియమించి అపరిచిత, అనుమానిత కొత్త వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. బీట్ పాయింట్లను పెంచి బీట్ ఆఫీసర్ తరువుగా తనిఖీ చేయాలన్నారు. అపార్టమెంట్లు, సింగిల్ ఇళ్లు, గుడులు, దేవాలయాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అక్రమ మద్యం అరికట్టేలా అమ్మేవారిపైన, రవాణ చేసేవారిపైనా చర్యలు తీసుకోవాలనిన్నారు. అదృశ్యం కేసుల్లో దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని ట్రేస్ చేయాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టుల్లో ఛార్జ్ షీట్లను సమర్పించి, సిసి, పిఆర్‌సి, ఎస్సి నెంబర్లు పొందాలని, నాన్ బెయిలుబుల్ వారెంట్లు వీలైనంత మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలపై దృష్టిసారించి అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 1930 టోల్ ఫ్రీ నెంబర్లను పబ్లిసిటీ చేయా లన్నారు.

సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరిగే అవకాశాలు ఉన్నందును ప్రతి ఒక్కరూ అతి జాగ్రత్తతో విధి నిర్వహణ చేయాలని, ఇప్పటి నుండి ఎన్నికల కోసం అధికార యంత్రాంగం సంసిద్ధం కావాలని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను విరివిగా సందర్శించి నిఘా పెడుతూ ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని, గతంలో ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలు, అతి సమస్యాత్మక గ్రామాల్లో గతంలో జరిగిన కేసుల్లో ఎవరెవరు ముద్దాయిలుగా ఉన్నారు వారిపై తీసుకుంటున్న చర్యలు గురించి ముందుగా సమాచారాన్ని సేకరించాలని ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచాలని తెలియజేసారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ మద్యం, నగదు తరలింపు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో రైడ్స్ చేపట్టాలని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరంవిధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్‌పి అందజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి, ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, కురుపాం ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు, సీతానగరం ఎస్ఐ రాజేష్, సాలూరు టౌన్ పిసి-608 జి.చంద్రశేఖర్ ఉన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, ఎఎస్‌పి సునీల్ షరోన్, డిఎస్పీలు ఎస్.ఆర్.హర్షిత, జివి కృష్ణారావు, జి.మురళీధర్, శేషాద్రి, ట్రైనీ డిఎస్పీ ఎస్ఎండి అజీజ్, సిఐలు సిహెచ్.లక్ష్మణరావు, వాసు నాయుడు, ఆర్ఐ శ్రీరాములు, పలువురు సిఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామసచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే పి.పుష్ప-శ్రీవాణి అన్నారు. మండలంలోని సంతోషపురంలో గ్రామసచివాలయ భవనంతో పాటు రైతుభరోసా కేంద్రం, పెద్దూరులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అలాగే ఉద్దవోలులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌లను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపిపి, జెడ్పీ వైస్‌చైర్మన్ ఉరిటి రామారావు, మరిశర్ల బాపూజీ నాయుడు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనంజయరావు, వైసిపి నాయకులు అంబటి గౌరునాయుడు, అక్కేన రామకృష్ణ, ఎంపిడిఒ జి.పైడితల్లి, మండల ఇంజనీరింగ్ అధికారి గోపి గౌరీశంకర్రావు, ఎఒ రేగిడి విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటికే ఎనలేని సేవలు అందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ, ఆర్‌బికె, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటికే సేవలు చేరువయ్యాయన్నారు. ప్రజలు వైఎస్ జగన్ పరిపాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ డి.రత్నకుమార్, జెఇ చంద్రమౌళి, ఎంపిపి శోభారాణి, జెడ్పిటిసి రేవతమ్మ, నాయకులు మజ్జి చంద్రశేఖర్, బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేటలో రూ.25లక్షలతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చెంతకు తెచ్చి సచివాలయం, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో వందల మీటర్లు సిసి కాలువలు, రోడ్లుతో పాటు నాడు నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గ్రామంలో ఇంటి ఇంటికీ కుళాయిలు ద్వారా తాగు నీరు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, సర్పంచ్ పెంట శ్రీదేవి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాజ్యాంగాన్ని రక్షించండి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో బిజెపిని బలపరిచే పార్టీలకు, వాటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, భారత రాజ్యాంగాన్ని రక్షించాలని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మిందొర, పరిసర గ్రామాల్లో గురువారం సిపిఎం మండలం కమిటీ సభ్యులు పి.రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి దేశంలో ప్రజలను విభజించే మతోన్మాద, ప్రజా, రాజ్యాంగ, లౌకిక, గిరిజన, దళిత, మహిళా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలను లొంగదీసుకునే రాజకీయ విధానాలపై ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సిపిఎంను బలపర్చాలని, స్థానిక సమస్యలు, మంచి నీరు, గిరిజన, రైతు సమస్యలపై పోరాటాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ఎల్.డి.వలస, తాన్నవలస, తొక్కుడువలస, పనసభద్ర గ్రామాల నాయకులు సింహాచలం, అప్పలస్వామి, పెంటయ్య, కృష్ణ, చిరంజీవి, టి.రాము తదితరులు పాల్గొన్నారు.


స్వయం సహాయక సంఘ గ్రూపు సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మహిళల సాధికారతే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక బిఎస్ఆర్ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో ఆసరా, చేయూత పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మండలంలోని 565 సంఘాల్లోని 6317 మందికి రూ.2.17 కోట్లు చెక్కు పంపిణీ చేశారు. అలాగే బ్యాంకు లింకేజీ 65 సంఘాల్లో 789 మందికి రూ.2.85 కోట్లు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జడ్పిటిసి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వైసిపి నాయకులు నిమ్మక గోపాల్, ఎపిఎం ఆదయ్య, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకే జిసిసి

ప్రజాశక్తి - భామిని

అటవీ ఉత్పత్తు లను ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేసి, గిరిజనులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకే జిసిసి అని మేనేజర్ డి.కృష్ణ అన్నారు. గురువారం భామిని సంతలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తుల ధరలు పట్టికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిసిసి మేనేజర్ మాట్లాడుతూ, గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులను ప్రభుత్వ నిర్దేశించిన ధరలకే అమ్ముకోవాలని, బయట అధిక ధర లభిస్తే అక్కడ అమ్ముకోవచ్చని తెలిపారు. అనంతరం కొండ ఉసిరి ఎలా నీటిలో ఆవిరి పట్టించి నిల్వ చేసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతి గురువారం భామిని సంతలో జిసిసి అటవీ ఉత్పత్తులు కొనుగోలు కేంద్రం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భామిని సేల్స్ మాన్ విశ్వనాధం, జి సి సి సిబ్బంది వున్నారు.



భామిని సంతలో ఏర్పాటు చేసిన అటవీ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం

డివిజికి డిప్యూటీ సిఎం పరామర్శ

ప్రజాశక్తి -సాలూరు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును డిప్యూటీ సీఎం రాజన్నదొర గురువారం పరామర్శించారు. ఇటీవల శంకరరావు మాతృమూర్తి మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో రాజన్నదొర విజయనగరంలో డివిజి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మంగమ్మ మృతి కి సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు పన్ను చెల్లించాలి : ఆర్‌టిఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు పన్ను చెల్లించాలని జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో గురువారం రోడ్ ట్యాక్స్ కట్టని వాహనాలను నిలిపివేసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఇంతవరకు రోడ్ ట్యాక్స్ కట్టనివారు డిసెంబర్ నెలాఖరులోగా పన్నులు కట్టాలన్నారు. లేని పక్షంలో జరిమానాతో పాటు రోడ్ టాక్స్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆటోలో, ట్రక్కర్‌లో అధిక లోడుతో వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా సి-బుక్, లైసెన్స్, రోడ్డు ట్యాక్స్‌కు సంబంధించిన పత్రాలు భద్రంగా ఉంచుకోవాలన్నారు.

టిడ్కో ఇళ్ల విద్యుద్దీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి సమీపంలో నిర్మాణమైన టిడ్కో ఇళ్లకు విద్యుదీకరణ పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ప్రారంభించారు. 26 బ్లాక్‌లకు సంబంధించి రూ.3కోట్లుతో చేపట్టనున్న విద్యుద్దీకరణ పనులకు భూమిపూజ చేశారు. వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల పంపిణీ ఫిబ్రవరి మొదటి వారంలో జరగనున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం టి.జయరాం, టిడ్కో ఇఇ జ్యోతి, విద్యుత్ (నిర్మాణ విభాగం), డిఇ త్రినాథరావు, ఎడిఇ వి.రంగారావు పాల్గొన్నారు.


విద్యుద్దీకరణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

ప్రజాశక్తి
www.prajasakti.com

అచ్చెన్నను కలిసిన వీరేష్‌చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం



అచ్చెన్నాయుడును కలిసిన వీరేష్‌చంద్రదేవ్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడును నిమ్మాడలో గల టిడిపి కార్యాలయం వద్ద కురుపాం రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గం తాజా రాజకీయ పరిస్థితులు టిడిపి మండలాల్లోని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, అభ్యర్థి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు ఏ విధంగా కష్టపడి పని చేస్తే గెలుపు సునాయాసానికి పలు సూచనలు సలహాలు అందించారని అన్నారు.



జిల్లా పోటీలకు ఎంపికైన శివరాంపురం కబడ్డీ జట్టు

జిల్లా పోటీలకు శివరాంపురం కబడ్డీ జట్టు


ప్రజాశక్తి - సాలూరు

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన శివరాంపురం జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. మెంటాడ టీంపై విజయం సాధించింది. మామిడిపల్లి ఖోఖో టీం నియోజకవర్గ స్థాయిలో పాచిపెంట టీంపై గెలుపు సాధించింది. ఈ టీమలును మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సర్పంచ్ జర్జాపు మోహన్‌రావు, కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల్లో గల ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3,200 దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని కోసింగభద్ర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి ఏటా శీతకాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థులు దుప్పట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



శిక్షణలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

టిడిపి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బోనెల విజయచంద్ర అధ్యక్షతన గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ టీమ్ ప్రవీణ్, సుకేష్ చంద్ర, రాము, వెంకటేష్, నారాయణరావు, నీరజ లక్ష్మి, ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, పార్వతీపురం రూరల్, టౌన్ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జికు పోల్‌మేనేజ్మెంట్, పైన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

సమావేశానికి టిడిపి కౌన్సిలర్లు గైర్హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ప్రతిపక్ష టిడిపి కౌన్సిల్ సభ్యులు ఎవరూ రాకపోవడంతో అజెండాలో ఉన్న 8 అంశాలను టేబుల్ అజెండాలో ఉన్న 5 అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపించగా సమావేశం ప్రారంభమైన కొంత సమయానికే కౌన్సిల్ సమావేశాన్ని ముగించేసి మమ అనిపించేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండపల్లి రుక్మిణి, పలువురు కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, ఇన్‌ఛార్జ్ మేనేజర్ దిబ్బా రూబేను, ఎఇ జి.ఆనంద్, ప్రజారోగ్యాధికారి సిహెచ్.మురళి, పాల్గొన్నారు.

టికెట్ల ధరలు పెంచితే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మీకు ఇష్టం వచ్చినట్లు టికెట్టు ధరలు పెంచితే చర్యలు తప్పవని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ బిఎంఆర్ థియేటర్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయానికి యాజమాన్యం పిలిపించి మాట్లాడారు. టికెట్ ధరలు అధికంగా పెంచుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రభుత్వ నిబంధన ప్రకారమే టికెట్ల ధరలు విక్రయించాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు క్లాసుల వారీగా టికెట్ ధరలు పట్టిక అందుబాటులో ఉంచాలని సూచించారు. మరోసారి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు .

ఒపిఎస్ సాధన బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 28న యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో పాత పెన్షన్ (ఒపిఎస్) సాధనకై తలపెట్టిన భారీ బహిరంగ సభకు తరలిరావాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద బహిరంగ సభ కరపత్రాలు విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. పాత పెన్షన్ అమలుపై రాష్ట్రంలోనే అన్ని రాజకీయ పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారి వారి మేనిఫెస్టో ప్రజలకు ఏం చేస్తాయి చెప్పి పార్టీలు ఉద్యోగులకు ఏం చేస్తాయి కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, ఎం.ముకుందరావు, సిహెచ్ తిరుపతి, కె.సింహాచలం, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓటే సామాన్యుడి ఆయుధం : జెసి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజాస్వామ్యంలో ఓటే సామాన్యుని ఆయుధమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ కె.హేమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. తమ ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరికి అవగాహనా ఉండాలన్నారు. మంచి సుపరిపాలన అందించే నాయకుని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోవడానికి ఓటు ఒక ఆయుధమని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వినియోగంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. డిఆర్‌ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయంపై అవగాహనా కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రాలేఖనం పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ బహుమతి ప్రదానం చేశారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి మంజుల వీణ, తహశీల్దార్ ఎన్.శివన్నారాయణ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట :అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిఒ పాల్గొన్నారు. దేశ భవిష్యత్తు యువ ఓటర్ల చేతుల్లోనే ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. సందర్భంగా సీనియర్ సిటిజన్లను, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లను పిఒ సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నర్సింహులు, ఎంపిడిఒ గీతాంజలి, ఆర్‌ఐ వెంకటేష్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్య అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు ప్రాధన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, డీటీ నాగేశ్వరరావు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లో, ట్రాన్స్ జెండర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకుముందు తహశీల్దార్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జయరాం ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. బోసుబొమ్మ జంక్షన్‌లో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఆ తర్వాత నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లకు, కొత్తగా నమోదైన యువఓటర్లను సన్మానించారు. ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవిన్యూ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యతంటూ విద్యార్థులు నినదించారు. జియమ్మవలస మండలం చినమేరంగి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు నమోదు, దాన్ని ఉపయోగించుకునే విధానం, ప్రజాస్వామ్య ప్రభుత్వ ఎంపికలో ఓటు ప్రాధాన్యతను విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు.

వీరఘట్టం : మండలంలోని జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు, అక్కడి నుంచి కోదండ రామా రైస్ మీలుగా మళ్లీ తహశీల్దార్ కార్యాలయనికి విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రతి ఒక్కరి హక్కు అని, ఓటుతోనే బుద్ధి చెప్పాలని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ, ఎంఇఒలు గౌరినాయుడు, ఆనందరావు, ఆర్‌ఐ లక్ష్మంనాయుడు, విఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ ఎం భుజంగరావు మాట్లాడుతూ18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. తమ ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు, ఉప తహశీల్దార్ కె.శివయ్య, ఆర్‌ఐ శ్రీనివాసరావు, స్థానిక ప్రజలు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న జెసి గోవిందరావు

సీతానగరం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్ ఆధ్వర్యాన ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వన్ అండ్ టూ పిఒలైన దాసరి రామకృష్ణ, బి.అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : ఓటు హక్కు వజ్రాయుధమని తహశీల్దారు పి.సోమేశ్వర్రావు అన్నారు. 14వ జాతీయ ఓటర్లు దినోత్సవ సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి తహశీల్దారు మాట్లాడుతూ ఓటు చాలా విలువైనదని, అర్హులైన వారందరు ఓటర్లుగా చేరాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు బుచ్చయ్య, ప్రిన్సిపాల్ శ్యామ్ బాబు, తదితరులు ఉన్నారు


గుమ్మలక్ష్మీపురం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాములమ్మ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైందని, ఓటు ప్రాధాన్యత ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆమె కోరారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, ఆర్‌ఐ గిరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



సీతంపేట : సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న పిఒ కల్పనాకుమారి



కురుపాం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ లావణ్య



గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 27న భీమిలి మండలంలో ఉత్తరాంధ్ర 34 నియోజకవర్గాల పార్టీ క్యాడర్‌తో నిర్వహించనున్న సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు శంఖారావం పూరించనున్న సందర్భంగా నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ క్యాడర్ అంతా కలిసి పాల్గొనబోతుందన్నారు. ఇందులో భాగంగా మున్సిపాల్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు కూడా తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఎఎంసి వైస్‌చైర్మన్ వానపల్లి శంకర్రావు, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు సచివాలయం కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కురుపాం

విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల కురుపాం తాలూకా సంఘ అధ్యక్షులు టి.పాండురంగారావు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ పెన్సర్ల సంఘ పిలుపు మేరకు కురుపాం తాలూకా విశ్రాంత ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో ఈనెల 1నుంచి తగ్గించిందని, అడిషినల్ క్వాంటమ్‌ను తిరిగి యధావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లు 70 ఏళ్లు నిండిన వారికి 10శాతం, 73 ఏళ్లు నిండిన వారికి 15శాతంను పునరుద్దరించాల్సినవి, పెండింగ్లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 11వ పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డ్ ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్లో వైద్యం అందించాలని, మెడికల్ రీఇంబర్సుమెంటు పరిధి రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచాలని కోరుతూ దశలవారీగా ఉద్యమాలు చేపడుతున్నామని అన్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్‌డిఒకు లావణ్య వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు టివిఎస్ స్వామియోజులు, టి.రామారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న హౌసింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బిల్లు చేయకున్న ఉండిపోయిన ఎన్టీఆర్ గృహ పథకం కింద గుర్తించిన ఇళ్లకు గానూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద గుర్తించిన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలని కోరారు. ఇప్పటికే మండలంలో పెండింగ్ బిల్లులను ప్రభుత్వం గుర్తించి నవరాత్నాల్లో చేర్చినప్పటికీ కూడా వాటికి ఇంకా చెల్లింపులు చేయలేదన్నారు. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలకు చేసిన అప్పులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు చేయాలని కోరారు.

బాబు వస్తేనే అభివృద్ధి : సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

బాబు వస్తేనే రాష్ట్ర అభివృద్ధి నియోజకవర్గ జరుగుతుందని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని నెలిపర్తి పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అన్న కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గాడి తప్పిన ఈ రాష్ట్ర పాలనను మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించగల సమర్థ నాయకత్వం ఉన్న వ్యక్తి చంద్రబాబు అని, అటువంటి వ్యక్తిని మరల ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే ఈ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు వంద కుటుంబాలు టిడిపిలో చేరారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ మండలాల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణు, భూసతౌడు గణపతి, గాంధీ, బంగారి , తిరుపతి రావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని లక్ష్మీనారాయణపురంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేయబోయే పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల బతుకు భారం చేస్తూ అధిక ధరలు, అస్తవ్యస్త పరిపాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు పాలనకు ఎదురుచూస్తున్నారని, అందుకు టిడిపికి రాష్ట్రంలో లభిస్తున్న ఆదరణే సాక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు బోను చంద్రమౌళి, పోల సత్యనారాయణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజలు బాగుండాలంటే 2024 ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కురుపాం నియోజకవర్గం సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి కోరారు. జియమ్మ మండలం చిలకాం పంచాయితీ ద్రాక్షనిలో టిడిపి సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక కొండలరావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



మక్కువ : చప్పబుచ్చింపేటలో ప్రచారం చేస్తున్న తేజోవతి

మక్కువలో అడుగు పెట్టిన తేజోవతి

మక్కువ : సాలూరు నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే టికెటును ఆశిస్తున్న ఎం.తేజోవతి గురువారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చప్పబుచ్చంపేట, వెంకటభైరపురం పంచాయతీల్లో ప్రజలతో ఈ కార్యక్రమం ద్వారా మమేకమయ్యారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రానికి ఎంతో మేలు కలుగుతుందని ఆమె ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. మండలంలోకి మొదటిసారిగా వచ్చిన తేజోవతికి మాజీ టిడిపి అధ్యక్షులు పెంట తిరుపతిరావు వర్గీయులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెంకటభైరిపురం మాజీ సర్పంచ్ దాకేటి దేవకీ పరమహంస, చప్పబుచ్చంపేట మాజీ సర్పంచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో రెండు పంచాయతీల్లో కార్యక్రమం చేపట్టారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

ప్రజాశక్తి - సీతానగరం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పని చేయాలని ఇంటిగ్రేడ్ సెంట్రల్ టీం శిక్షకుడు సత్తిబాబు అన్నారు. స్థానిక మండల టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు అధ్యక్షతన ఇంటిగ్రేడ్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలకు క్షేత్రస్థాయిలో ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంరద్ర మాట్లాడుతూ ఓట్ ఫర్ టిడిపి, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, ఓటర్ల జాబితా పరిశీలన, సాధికారిక సభ్యుల ఎంపిక వంటి వాటిని క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, బి.శ్రీనివాస రావు, కె.రామకృష్ణ, వై.భాస్కరరావు, పి.సత్యంనాయుడు, వై.రామినాయుడు, బూత్ ఇన్చార్జులు నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

అధికారుల పర్యవేక్షణేది?

సీతంపేట : మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ కొరవడుతోందని, దీనివల్ల గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి జరగడంలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు సగం కూడా నిర్మాణం జరగలేదన్నారు. నిర్మాణం పూర్తి అయినా చాలా కాలంగా ప్రారంభించనివి ఉన్నారు. మండల పరిషత్ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎంపిడిఒ మండల అభివృద్ధికి, పెండింగ్‌లో ఉన్న జలజీవన్ పనులు, రోడ్డు పనులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతిలో పంటలు సాగుచేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

యాజమాన్య పద్ధతిలో పంటలు సాగు చేస్తే రైతులకు లాభాలతో పాటు భూసారం కూడా పెరుగుతుందని ఎడిఎ ఆర్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని తెట్టంగిలో రైతులతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. పంటలు సాగు, వ్యవసాయ అధికారులు సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ ఎడిఎ రత్నకుమారి, సర్పంచి ఎ.విజయ, ఎంపిటిసి ఎస్.చిన్నంనాయుడు, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, ఆర్బ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆదిత్య బిర్లా ట్రస్ట్ సహకారంతో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం విద్యార్థులకు చాలా అవసరమని చెప్పారు. చదువుపై ఏకాగ్రత పెరగాలంటే మానసికంగా, ఆరోగ్యంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. పాఠశాల హెచ్ఎం ఎ.అప్పలనాయుడు మాట్లాడుతూ పౌష్టికాహారంతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నీడ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.మోహనరావు, బి.రత్నం పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యాన 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సాయిబాబా గుడి ఎదురు మైదానం వద్ద జరుగుతున్న ఆడదాం ఆంధ్ర పోటీల్లో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ఫైనల్‌కు చేరిన కొమరాడ మండలం గుమడ కురుపాం మండల మొండెంఖల్ గ్రామాల టీంల క్రీడాకారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒక క్రీడాకారుడు ఒకే ఆడాలి కానీ ఒక్కొక్క క్రీడాకారుడు రెండు చోట్ల ఆడుతున్నారని, రిజిస్ట్రేషన్ లేనివారు కూడా వచ్చి ఆడుతున్నారని ఆరోపిస్తున్న నేపథ్యంలో ఘర్షణ నెలకొంది. దీంతో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై ఎస్. షణ్ముఖరావు క్రీడా మైదానం వద్దకు వచ్చి దగ్గరుండి ఇరుజోట్లకు ఆటను ఆడించారు. ఈ పోటీలో మొండెంఖల్ గ్రామ జట్టు విజయం సాధించింది.



క్రీడాకారులతో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

నేరాలు ఘోరాలు

మహిళా పోలీసుపై భర్త దాడి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో వాటపాగు సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె.అంజలిపై అదే సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆమె భర్త ఎ.యాదన్న గురువారం దాడి చేశారు. ఇద్దరు మధ్య కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్నాయి. వేర్వేరుగానే జీవిస్తున్నారు. గురువారం ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుని అంజలిపై దాడి చేశాడు. 108 సాయంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ప్రశాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని గొల్లవీధికి చెందిన బి.రామకృష్ణ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై రామకృష్ణతో పాటు మరో ఇద్దరు ఎస్.గోపాలపురం నుండి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన రామకృష్ణను ఆ ఇద్దరు వ్యక్తులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకువచ్చారు. వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పాలకొండ చికిత్స అనంతరం శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రికి వైద్యం కోసం తరలించినట్లు బంధువులు తెలిపారు.